## మీవెంటే ఉంటా.. గెలిపించండి

**బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు**

చర్ల, నవంబర్ 18 : ఆదివాసీల సమస్యల పరిష్కారానికి నిరంతరం మీవెంటే ఉంటానని భద్రాచలం ఎమ్మెల్యే నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి ఆర్.కొత్తగూడెం గ్రామంలో ఆయన మాట్లాడారు. వలసపాలకుల వల్ల రాష్ట్రంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూనే సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్నారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. దానవాయిపేట గ్రామానికి చెందిన 70 కుటుంబాల వారు తెల్లం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు సోదరుడు తన్నీరు మహేశ్, రైతు నాయకుడు సాగి శ్రీనివాసరాజు, సత్యనారాయణపురం సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ఆర్ కొత్తగూడెం సర్పంచ్ ముప్పిడి లక్ష్మి, జోగిరాజు, గొర్ల రాజబాబు, గుర్రం రవి, ఏనుటి జనార్ధన్, తుర్రం రాజు, వేములవాడ క్రిష్ణార్జునరావు, కేప గణేష్, బట్టా విజయ్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి మృతి

పాల్వంచ రూరల్, నవంబర్ 18: విధి నిర్వహణలో ఉన్న ఓ ఉపాధ్యాయుడు అనారోగ్యానికి గురై హఠాన్మరణం చెందిన ఘటన కొత్తసూరారంలో జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మునియా (45) అనే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. రోజూలాగానే శనివారం పాఠశాలకు వచ్చిన మునియా ఉన్నట్టుండి కుప్పకూలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన పాఠశాల సిబ్బంది ఆయన్ను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

## భద్రాచలం అభివృద్ధికి బాటలు వేద్దాం

- తెల్లం వెంకట్రావును గెలిపిద్దాం
- బీఆర్ఎస్ యూఎస్‌ఏ చైర్మన్ తన్నీరు మహేష్

భద్రాచలం, నవంబర్ 18: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి భద్రాచలం నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేద్దామని పార్టీ యూఎస్‌ఏ చైర్మన్ తన్నీరు మహేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదన్నారు. కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ నాయకులు కూడా రైతు బంధు, రైతుబీమా పొందుతున్నారన్నారు. దశాబ్దాలుగా నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని, ఇక్కడ ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉండడంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. తెల్లం వెంకట్రావు కరోనా సమయంలో ఎంతో మంది ప్రాణాలను కాపాడారని, అలాంటి మంచి వ్యక్తిని ప్రజలు గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నాకే ఏజన్సీవాసుల జీవితాల్లో మార్పులు వచ్చాయన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు మారాలన్నా, గ్రామాల్లో అభివృద్ధి జరగాలన్నా బీఆర్ఎస్ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు తనను ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఐలు బిందులత, సురేష్‌రావు, దొంతినేని శ్రీనివాసరావు, పిన్న భాస్కరరావు, తూముల అనీల్ రావు, గుండపనేని మధూరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, నాయకులు ఎండీ నవాబ్, దుద్దుకూరి సాయిబాబా పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యూఎస్‌ఏ చైర్మన్ తన్నీరు మహేష్, పక్కన తెల్లం వెంకట్రావు

# కారు జోరు.. కాంగ్రెస్ బేజారు




బీఆర్ఎస్‌లో చేరిన ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన వారితో ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు



దుమ్ముగూడెం : ఎన్.లక్ష్మీపురంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో మండల అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణమూర్తి

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు**

**రోజురోజుకూ పెరుగుతున్న వలసలు**

భద్రాచలం, నవంబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో బీఆర్ఎస్ పార్టీ ప్రాబల్యం దినందినం పెరుగుతోంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ జోరు తగ్గి బేజారు అవుతోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు విపరీతంగా పెరిగాయి. ఇటీవలే 35ఏళ్లుగా సీపీఐ పార్టీలో ఉండి రాష్ట్ర పదవుల్లో కొనసాగిన రావులపల్లి రాంప్రసాద్ తన అనుచరులతో కలిసి ఐటీ మంత్రి కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. శుక్రవారం రాత్రి సుభాష్‌నగర్ కాలనీలోని 900 కుటుంబాలు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి ధనేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరాయి. శనివారం ఉదయం ఇండస్ట్రీయల్ ఏరియాలోని సుమారు 100 కుటుంబాలు బీఆర్ఎస్‌తోనే మా పయనం అంటూ డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భద్రాచలం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా వదిలివేయడంతో కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.

### తెల్లం గెలుపుకోసం విస్తృత ప్రచారం

బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు విజయాన్ని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చాట్ల రవికుమార్ 142 బూత్‌లో శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించేందుకు కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణంలోని 42 బూత్ కమిటీల ఇన్‌చార్జిలు ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.



చర్ల : ఇంటింటి ప్రచారంలో మహిళా కార్యకర్తలు

### ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

చర్ల, నవంబర్ 18 : భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. శనివారం ఆనందకాలనీలో మాజీ ఎంపీపీ సోయం కృష్ణవేణి, మహిళా కార్యకర్తలు, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, చింతా నాగుబాబు, దొడ్డి తాతారావు, దొడ్డి సూరిబాబు, అజీజ్, ఇరసవడ్ల రాము, కాకి అనిల్, ఆలం ఈశ్వర్, అలవాల మహేశ్‌నాయుడు, కుక్కడపుసాయి, పంజా రాజు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామగ్రామాన ఎన్నికల బూత్ కమిటీల ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

### బీఆర్ఎస్ గెలిస్తేనే సంక్షేమం కొనసాగింపు

దుమ్ముగూడెం, నవంబర్ 18: బీఆర్ఎస్ గెలిస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, కాంగ్రెస్ గెలిస్తే అధోగతి తప్పదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి అన్నారు. ఎన్.లక్ష్మీపురంలో వివిధ పార్టీలకు చెందిన 40 కుటుంబాలు శనివారం ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో సింగవరం సర్పంచ్ సోడి కొండయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, నాయకులు బొల్లి శేఖర్, ఈర్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

### తెల్లం గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలి

భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు కోసం కార్యకర్తలు కష్టపడాలని పార్టీ మండల అధికార ప్రతినిధి జానీపాషా సూచించారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి కె.రేగుబల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతిగడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించాలన్నారు. ప్రచారంలో ఎంపీటీసీ సోడె తిరుపతిరావు, సర్పంచ్ రామకృష్ణ, నాయకులు కణితి భద్రయ్య, కారం జోగయ్య, సున్నం నర్సింహారావు, కణితి శేఖర్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 18 : భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాత్రాపురం, రాచపల్లి గ్రామాల్లో శనివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుపై ఓటేయ్యాలని కోరారు.



ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

## రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, నవంబర్ 18 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం అంతరాలయంలోని మూలవరులకు స్వర్ణ తులసి పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులు పరవశించిపోయారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం జరిపించారు. స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి కల్యాణం జరిపించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.



రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## 27న నిత్య కల్యాణం నిలిపివేత

భద్రాచలం, నవంబర్ 18 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ సోమవారం స్వామివారి నిత్య కల్యాణాన్ని నిలిపివేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి శనివారం ప్రకటనలో తెలిపారు. 27న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో 'కృత్తికా దీపోత్సవం' అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించుకోవాలని కోరారు.

## నేడు భద్రాద్రి రామయ్య సన్నిధికి మంత్రి కేటీఆర్

భద్రాచలం, నవంబర్ 18 : భద్రాచలం సీతారామచంద్రస్వామిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం దర్శించుకోనున్నారు. అనంతరం భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపు కోసం భద్రాచలం పట్టణంలో రోడ్ షో నిర్వహించి ప్రసంగించనున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో సారపాక ఐటీసీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం ద్వారా 11:15కు బయలుదేరి 11:30 గంటలకు స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో రోడ్డు షో నిర్వహించి అంబేద్కర్ సెంటర్ వద్ద ప్రసంగిస్తారు. అనంతరం సారపాక చేరుకొని అక్కడి నుంచి ఇల్లెందుకు బయలుదేరి వెళ్తారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చుంచుపల్లి, నవంబర్ 18 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొత్తగూడెం ఆధ్వర్యంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు శనివారం ప్రకటనలో తెలిపారు. చుంచుపల్లి మండలంలోని పెనగడప, చుంచుపల్లి, రాంపురం, సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్, సింగభూపాలెం, వేపలగడ్డ, గరీబ్‌పేట, లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ, హేమచంద్రాపురం, అనిశెట్టిపల్లి, రేగళ్ల గ్రామాల్లో మొత్తం 11 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2203, సీ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2183 ధర ఉంటుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేమశాతం 17 వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.